## ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం

ప్రజాశక్తి - కడప

'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వి విజయ్ రామరాజుతోపాటు జెసి జి.గణేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులకు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారాలను అందించాలని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

# గడువులోగా అర్జీలను పూర్తి చేయాలి : కలెక్టర్

విసి ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - కడప

ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం-6,7,8 అర్జీల పెండెన్సీలను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాలులో ప్రయారిటీ బిల్డింగ్స్, కాస్ట్ సర్వే, ఆరోగ్య సురక్ష సర్వే,పెండింగ్ ఫారాలు, ఆరోగ్యశ్రీ కార్డులు, పంచాయితీ కార్యదర్శులు, వాలంటీర్లు, అటెండెన్స్, ఎపి సర్వీసెస్, హౌసింగ్, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్నకు చెబుదాం, వివిధ సంక్షేమ పథకాలపై జెసి గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలిసి మండల అధికారులతో విసి ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రయారిటీ బిల్డింగ్స్ సంబంధించి స్టేజ్ కన్వర్షన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ ప్రాసెసెడ్ అర్జీలను పెండింగ్ లేకుండా ఏ రోజుకు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష సర్వేలో ఎలాంటి పెండింగ్ లేకుండా పంచాయితీ, సచివాలయాల్లో త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. మిగిలిఉన్న ఆరోగ్యశ్రీ కార్డుల డిస్ట్రిబ్యూషన్‌ను సచివాలయ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాల్లో పంచాయతీ సెక్రటరీ వాలంటీర్ల అటెండెన్స్‌పై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల్లో బియాండ్ ఎస్ఎల్ఎ అర్జీలకు పరిష్కార మార్గం చూపి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు ఆర్‌డిఒలు మధుసూధన్, శ్రీనివాసులు, ఇఆర్‌ఒ కౌసర్ బాను, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డిఎస్‌పి షరీఫ్, డ్వామా పీడీ యధుభూషణ్ రెడ్డి, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్, సిపిఒ వెంకటరావు, పిఆర్ ఎస్‌ఇ శ్రీనివాసులురెడ్డి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

# విద్యుత్ కోతలు నివారించాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

విద్యుత్ కోతలను నివారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట రైతులతో కలిసిధర్నా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉద్యానవన పంటలు అరటి, ఆకుతోటలు చీనీ, బొప్పాయి, నువ్వు , వేరుశనగ పంటలు బోర్ల కింద సాగు చేశారని తెలిపారు. కరెంటు కోతలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు. 9 గంటలు సరఫరా అవుతున్న విద్యుత్‌ను ప్రస్తుతం ఏడు గంటలకు కుదించారని వాపోయారు. అది కూడా ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు తీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కరెంటు కోతలపై మండల విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, తెలిపారు. మండలాన్ని ప్రత్యేక దృష్టిలో ఉంచుకొని తొమ్మిది గంటలు కరెంటు నిరంతరాయంగా సరఫరా చేయాలని ఆయన కోరారు. కరెంటు కోతలను నివారించకపోతే రాబోవు కాలంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చెబుతామని హెచ్చరించారు నిరసన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు చిన్న సిద్దయ్య, హరి, బంకు సిద్ధయ్య, రమణ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు, రైతులు

# ప్రాంతీయ పార్టీలు బిజెపికి బానిసలు : కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడతున్న ఎం. సుధాకర్‌బాబు

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన అన్నీ పార్టీలూ బిజెపికి బానిసలుగా మారాయని కాంగ్రెస్ పార్టీ కడప పార్లమెంటు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ఎం.సుధాకర్ బాబు ఘాటుగా విమర్శించారు. సోమవారం కడపకు వచ్చిన ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని, దేశాన్ని సర్వనాశనం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీ టిడిపి, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీలు చేస్తున్న తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాంగ్రెస్ పార్టీ తక్షణ కర్తవ్యం అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నాయకులను, బూతు లెవెల్ కార్య కర్తలను సమన్వయపరుస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి పార్టీల వల్ల రాష్ట్రానికి గాని ప్రజలకు గాని ఏ మేలు జరగలేదన్నారు. పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్ట చతుష్టయ పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించాలని కోరారు. అరకు లోయ ఒకప్పుడు కాఫీకి ప్రసిద్ధి అని, ప్రస్తుతం గంజాయి సాగుతో దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.డి విజయ జ్యోతి, నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం శర్మ, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రామాంజనేయులు, పీర్ల రషీద్, శ్రీకాంత్, శివ, చిన్నపరెడ్డి ,అచ్యుత రాజు? వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కార్యదర్శిగా విజయ్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంట్ బిసి విభాగం కార్యనిర్వాహక కార్యదర్శిగా తెల్లదారుల విజయ్ కుమార్ యాదవ్‌ను నియమిస్తూ కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నర్సింహారెడ్డి నియామక పత్రం అందజేశారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిసిలను అన్ని విధాలుగా ఆదుకున్న ఏకైక పార్టీ టిడిపినే అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలు ఏకమై చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజీతోనే అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - కడప

మాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా పోలీస్ అధికారులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మార్చి 9న నిర్వహించబోయే జాతీయాలోక్ అదాలత్ సందర్భంగా సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో పోలీస్ అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ కేసులో రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. పోలీస్ అధికారులతో, కోర్టు కానిస్టేబుల్ లతో పోలీస్ స్టేషన్లు వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా గాని, ఈమెయిల్ అడ్రస్ kadapa.d courts. gov.in, dlsakdp@gmail.com ద్వారా కానీ సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్ విద్యార్థులకు రిమ్స్ దంతవైద్యులు ఉచిత దంతవైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు దంతాలను ఉదయం, రాత్రి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్యపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. దంతాలు పరీక్షించి అవసరమైన వారికి ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జోస్నా, డాక్టర్ జాన్, డాక్టర్ రిషిద, స్కూల్ చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విద్యా సంస్థల సిఇఒ ఎ.ఎల్.వివేకానంద, డైరెక్టర్ ఎ.వీరకుమారి, పల్లవి, ప్రిన్సిపల్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యులు

## సెక్యూరిటీలకు వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

**కడప అర్బన్ :** జిల్లా వ్యాప్తంగా డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 7 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఏజెన్సీ వారు బిల్లులు రాలేదని స్పందించడం లేదని చెప్పారు. ప్రొద్దుటూరులో పెండింగ్‌లో ఉన్న క్లాప్ డ్రైవర్స్ వేతనలు వెంటనే చెల్లించాలని కోరారు. 8 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీని రద్దు చేయాలని కోరారు.

## జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**కడప అర్బన్ :** బంజారా ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి ఉత్సవాల పోస్టర్‌ను డిప్యూటీ సిఎం అంజాద్‌బాష ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్, వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఐ.శివా నాయక్, ఎస్‌టి సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగయ్య పాల్గొన్నారు.

## ఒబిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**కడప సిటీ :** చట్టసభలలో ఒబిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి బిసి కుల జన గణనను కేంద్రమే చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, పార్లమెంటు విభాగం అధ్యక్షులు రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పాత రిమ్స్‌లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18న ప్రొద్దుటూరులో నిర్వహించబోయే బిసిల ఆత్మగౌరవసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభకు జాతీయ రాష్ట్ర జిల్లాల బిసి నాయకులు హాజరవుతున్నారన్నారు. అనంతరం బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా పి.పెద్ద ఓబులేసును, నగర ఉపాధ్యక్షులుగా అజంతా ఆర్ట్స్ ఆర్.హుస్సేన్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గురుమూర్తి ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, బిఇస సంక్షేమ సంఘం నాయకులు జె.నటరాజ్ సుంకేసుల ఖాదరబాషా, ఆర్ మునిరత్నం గౌడ్, జింక మార్కండేయ, వల్లూరు నారాయణమ్మ, పస్తం అంజి పాల్గొన్నారు.

## టిడిపి ఇంటింటి ప్రచారం

**కలసపాడు :** మండలంలోని మామిళ్లపల్లె, కర్నంవారిపల్లె గ్రామాల్లో టిడిపి అభ్యర్థి బొజ్జ రోషన్న సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు రితీష్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో ఎస్‌సి రిజర్వుడు సీటును తనకు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనకు ఉండాలని కోరారు. బద్వేల్ నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేసేందుకు అందరం సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రంతు, కలసపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు సంధిరెడ్డి, పట్టాభిరెడ్డి, కర్ణం వారి పల్లె టిడిపి నాయకులు, యువ నాయకులు దుగ్గిరెడ్డి, నాగేశ్వరరావు, జక్కా సుధాకర్, భద్రయ్య, ప్రభాకర్, మల్లికార్జున పాల్గొన్నారు.

# అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

## డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దహనం

ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మెగా డిఎస్‌సి వస్తుందని నిరుద్యోగ ఉపాధ్యాయులు సుదీర్ఘకాలంగా ఎదురు చూసిన వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం 6,100 పోస్టులతో డిఎస్‌సిలో నోటిఫికేషన్ విడుదల చేయడం తీవ్ర నిరాశకు గురి చేసిందని, ఇచ్చిన అరకొర డిఎస్‌సిలో మళ్లీ వెట్టి చాకిరీ విధానమైన అప్రెంటిస్‌ను పునరుద్ధరించడాన్ని వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట అప్రెంటిస్ విధానంతో విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్ సంబంధించిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో వింత పోకడలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు నిరంతరం పోరాడుతుంటే.. ఉన్న సమస్యలను పరిష్కరించకపోవడం ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టించి ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టివేసే ప్రణాళికతో ముందుకు వెళ్లడం సిగ్గుచేటు అన్నారు. గతంలో ఉన్న అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకోవడం కోసం 15 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటాలు చేశామని, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 13 రోజుల పాటు సమ్మె కూడా చేసి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకోగలిగామని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి తన తండ్రి రద్దు చేసిన వెట్టి చాకిరీ విధానాన్ని పునరుద్ధరించడం ఎంతవరకు సబబు ఆలోచించుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగమే సాధనగా కుటుంబాలకు దూరమై కోచింగ్ సెంటర్లు వెంబడి సుదీర్ఘకాలం పాటు కళ్ళు కాయలు కాసేలా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన యువతకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఒక షరాగతంగా ఉందని చెప్పారు. ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత ధరల్లో అప్రెంటిస్ విధానంతో ఉపాధ్యాయులు నియామకం పొందితే వారి జీవన విధానం ఎలా నెట్టుకు రాగలరని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి విడుదల చేసిన అప్రెంటిస్ విధాన డిఎస్‌సి నోటిఫికేషన్ రద్దు చేసి రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేసే విధంగా నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ ప్రజా సంఘాలను ఏకం చేసి ప్రభుత్వం మెడలు వంచన ఇలాంటి జీవోలు రద్దు చేయించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు కేదార్ నాథ్, బత్తుల చంద్రశేఖర్, గోపీనాథ్, అబ్దుల్ గని, కిరణ్ బాబు, పోతురాజు చంద్రశేఖర్, బాబు, జానకి రామ్, శ్రీనివాసులు, కొండయ్య, సుజిత్ కుమార్ పాల్గొన్నారు.

'గడప గడపకూ'లో

# టిడిపి, వైసిపి కార్యకర్తల ఘర్షణ

### జెండాల విషయంలో ఒకరిపైమరొకరు దాడులు

### వైసిపి కార్యకర్తకు గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని దండుపల్లిలో ఆదివారం వైసిపి శ్రేణులు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలు.. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకు కార్యక్రమానికి దండుపల్లికి వెళ్తున్న నేపథ్యంలో అప్పటికే ఆగ్రామంలోని విద్యుత్ స్తంభాలకు కట్టిన టిడిపి జెండాలను తొలగించి వాటి స్థానంలో వైసిపి జెండాలను కట్టారు. గమనించి టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుని చివరకు దాడులు పాల్పడే స్థాయికి చేరింది. ఈ సంఘటనలో వైసిపికి చెందిన కార్యకర్తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు టిడిపి కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తరువాత అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో ఎర్రగుంట్ల పట్టణంలోని టిడిపి కార్యాలయంపై వైసిపి కార్యకర్తలు దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న భూపేష్‌రెడ్డి టిడిపి కార్యాలయానికి బయలు దేరారు. పోలీసులు ఆయన్ను ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వద్ద ఆపారు. పోలీసులు టిడిపి కార్యాలయానికి చేరుకుని వైసిపి కార్యకర్తలను అక్కడి నుంచి పంపించారు. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరిపైనొకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

టిడిపి కార్యాలయంపై దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్

## చోరీకి గురైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఆరు నెలల నుంచి ప్రొద్దుటూరు పట్టణంలో, చుట్ట పక్కల ప్రాంతాల్లో చోరీకి గురైన ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాంటీన్‌లు, డాబాల వద్ద, గృహల సముదాయంలో నిలిపి ఉంచిన టివిఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలే లక్ష్యంగా ఈ చోరీలు జరిగినట్లు తెలిపారు. ఒక మనిషి సులభంగా ఎత్తుకు పోగలిగే వాహనాలు కాబట్టి, వాటినే లక్ష్యంగా చేసుకొని రూ.15లక్షల విలువగల 21 వాహనాలను చోరీచేసినట్లు తెలిపారు. దువ్వూరు గ్రామం అశోక్‌నగర్ షావుకార్లవీధికి చెందిన అంకయ్య అనే వ్యక్తి మాస్టర్ కీ ఉపయోగించి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. గత నెల 24న గోర్ల ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరక్కుండ వీల్‌లాక్‌తో తమ ద్విచక్రవాహనాలను భద్రపరచుకోవాలని ఎస్‌పి సూచించారు. సమావేశంలో డిఎస్‌పి మురళీధర్, సిఐ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

## భూములను చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని తెల్లపాడు పంచాయతీలో దళితులకు కేటాయించిన భూములను కొందరు అగ్రకులాల వారు దౌర్జన్యంగా డోజర్లతో చదును చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సగిలి గురయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెల్లపాడు పంచాయతీలోని దూలంవారిపల్లె ప్రజలు గతంలో భూ పోరాటం చేయడంతో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా దళితులకు కలసపాడు వన్-బిలో వందమందికిపైగా భూ పట్టాలు మంజూరు చేసి హక్కు పత్రాలు ఇప్పించారని చెప్పారు. భూస్వాములు, అగ్రకులాలకు చెందిన వారు దళితులపై కన్నేసి వారి భూములను దౌర్జన్యంగా డోజర్లతో దొబ్బి చదును చేసుకున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణ భూములను పరిశీలించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సగిలి గురయ్య

## ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ( ఎపిటిఎఫ్ 257) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆదిరెడ్డి శ్యాం సుందర్ రెడ్డిని వరుసగా 11వసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 10,11 తేదీలలో విజయవాడలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. 2010 నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టవ్యాప్తంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా నన్నారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## పీజీ డిప్లమో కోర్సులకు ప్రవేశాలు

**కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం జర్నలిజం, లలిత కళల విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 13 నుంచి 20 వరకు నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రవేశ సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో 'పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్,(పీజిడీపిఆర్)', 'పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ తెలుగు జర్న లిజం (పీజిడీటీజే)', ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో 'పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ (పీజిడీటీఏ)' కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏడాది కాలం (రెండు సెమిస్టర్ల )గల ఈ కోర్సులలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారెవరైనా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించి తరగతులు పూర్తిగా సాయంత్రం వేళల్లో ఉంటాయని పేర్కొన్నారు.

## వైవీయూలో కొత్త క్యాంటీన్ హాల్ ప్రారంభం

**కడప అర్బన్ :** యోగివేమన విద్యాలయం ప్రాంగణంలో ఒయాసిస్ పేరుతో కొత్త క్యాంటీన్ హాలును విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి సుధాకర్ మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయ నిధులు రూ. 55 లక్షలు వెచ్చించి అధునాతనంగా ఈ భవనాన్ని నిర్మించామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఆహ్లాదకరమైన వాతావరణం, సౌకర్యవంతంగా ఆహార పదార్థాలు భుజించేలా వసతులు కల్పించామని అన్నారు. కార్యక్రమంలో వైవీయూ ప్రధాన ఇంజినీరు రాజశేఖర్ రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య విజయరాఘవ ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి , ఐక్యూఎసి సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ఆచార్య ఎ. మధుసూదనరెడ్డి, ఇంజినీరు రామచంద్ర రెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 17న ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

పార్లమెంట్ భవనంలో నిర్వహించే జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2024 అనే కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు ఈనెల 17న నిర్వహించనున్నట్లు నెహ్రు యువ కేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప, అన్నమయ్య జిల్లాలలోని 18-25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. జిల్లాలో గెలుపొందిన రాష్ట్ర, దేశ స్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. గెలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ వర్చువల్ పద్ధతిలో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9177616677 నంబరు సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవిఐ బి.వెంకటప్రసాద్

## నిబంధనలు తప్పక పాటించాలి : ఎంవిఐ

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎంవిఐ బి.వెంకటప్రసాద్ పేర్కొన్నారు. 35వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన తన కార్యాలయంలో లారీ డ్రైవర్లు, ఆటోవాలాలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించి రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. అతివేగం ప్రమాదానికి దారితీస్తుందని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అలాగే కొత్తగా వచ్చిన నియయ నిబంధనలను వారికి వివరించారు.

## ఆవులను దూర ప్రాంతాలకు తరలిస్తాం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఆవులను రోడ్లపై విడిస్తే వాటిని దూరప్రాంతాలకు తరలిస్తామని పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి సోమవాకం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు రోడ్లపై తిరుతున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని కడప-పులివెందుల, గండి రోడ్డులో, మార్కెట్‌లో విచ్చలవిడిగా ఆవులు రోడ్లకు అడ్డంగా తిరుగుతున్నాయన్నారు. తద్వారా ప్రజలకు, వాహనదారులకు, పాదచారులకు చాల ఇబ్బందిగా ఉందన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకుని యజమానులు తమ ఆవులను రోడ్లపైకి విడవరాదని సూచించారు. రోడ్లపై ఉన్న ఆవులను మూడు రోజుల్లో తరలించుకెళ్లాలని, లేనిచోవాటిని తామే దూర ప్రాంతాలకు తీసుకెళతామన్నారు.

మాట్లాడుతున్న జమాఅత్ పట్టణ అధ్యక్షులు షఫివుల్లాహ్

## మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

**- ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం : జమాఅతె ఇస్లామి హింద్**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరు జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుండి 18వ తేదీ వరకు 'మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం-ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం' అనే కార్యక్రమం నిరహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు షఫివుల్లాహ్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా జమాఅతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పెన్నానగర్‌లోని భారత్ ఫంక్షన్ హాల్‌లో బహిరంగసభ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా జమాఅతె ఇస్లామి హింద్ జాతీయ ఉపాధ్యక్షులు జనాబ్ మౌలానా వలియుల్లాహ్ సయ్యది, ఫలాహి, జమాఅతె ఇస్లామి హింద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రఫీఖ్ హాజరువుతున్నరని తెలిపారు. పట్టణ ప్రజలు కులమతాలకు అతీతంగా సభను విజయవంతం చేయాలని వారు కోరారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో స్థానిక జమాఅత్ మీడియా కార్యదర్శి షరీఫ్, సభ్యులు మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

## ఎంపిడిఒగా చంద్రమౌళీశ్వర్ బాధ్యతలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ముద్దనూరు ఎంపిడిఒగా చంద్రమౌళీశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బద్వేల్ నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ సూర్య నారాయణరెడ్డి కర్నూలు జిల్లా చాగలమర్రి మండలానికి బదిలీ అయ్యారు.

వినతిపత్రమిస్తున్న వైసిపి నాయకులు

## బోగస్ ఓట్లపై విచారించండి : వైసిపి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నమోదైన బోగస్ ఓట్లపై విచారించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలనాధికారికి మున్సిపల్ వైసిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. చిరునామాతో సంబంధం లేని కొత్త వ్యక్తులను ఓటర్లుగా నమోదు చేశారని, వాటిని నమోదు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజుల్ల, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, నాయకులు సంపత్, నాగరాజు, సుభాష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## చౌటపల్లె వాసులు వైసిపిలో చేరిక

**ప్రజాశక్తి - మైదుకూరు**

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నలూరు పంచాయతీ చౌటుపల్లి గ్రామంలో సోమవారం 50 కుటుంబాలు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. అచ్చుకట్ల, కరీముల్లా, అమీర్ బాషా, కాసిం వల్లి, ఫక్రుద్దీన్, షరీఫ్ జాఫర్ రియాజ్, హుస్సేన్, పీరా అబ్దుల్ తదితరులు చేరారు. అనంతరం రూ.8,20,000తో మసీద్ ప్రహరీ, రూ.5 లక్షలతో ప్యూరిఫైడ్ స్వచ్ఛమైన తాగునీరు ప్లాంటును ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. అన్నలూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని రూ.23 లక్షల 96వేలతో నిర్మించారు. అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మైదుకూరు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, తహశీల్దార్ వై.నరేంద్రనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీద్ ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

# ఒక్క ఇంటి పట్టా కూడా ఇవ్వని చంద్రబాబు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

**ప్రజాశక్తి - మైదుకూరు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిరుపేదల కోసం జగనన్న కాలనీల ద్వారా గ్రామాలను సృష్టించారని, చంద్రబాబు పాలనలో ఒక్కరికి కూడా ఇంటి పట్టా ఇచ్చిన దాఖలాల్లేవని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలను తీర్చామన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి సిమెంటు రోడ్లు, బిటి రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. తమ ప్రభుత్వం హయాంలో మైదుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి చేశాం కాబట్టే నేడు గ్రామాల్లోకి వెళుతున్నామన్నారు. అడగకుండానే సిఎం జగన్ ప్రజలకు కావలసినవన్ని సమకూరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా అర్హులైన మహిళలకు రూ.75వేలు నేరుగా వారి అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. మహిళలు ఉత్సాహంగా వైసిపి సభలకు వస్తున్నారని తెలిపారు. రైతు భరోసా ద్వారా రైతులను ఆదుకున్నామన్నారు. అభివృద్ధి చేసి ఉంటేనే వైసిపికి ఓట్లు వేయాలని అడగగలుగుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. అదే తెలుగుదేశం పార్టీ వారు అడగగలరా అని ఆయన ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వంలో కేవలం వారి కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

**వైసిపి జిల్లా సెక్రెటరీగా ముజాఫర్**

మైదుకూరు పట్టణానికి చెందిన సయ్యద్ ముజాఫర్‌ను వైసిపి జిల్లా సెక్రటరీగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తన కార్యాలయంలో ముజాఫర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుం దన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# గురువులను గౌరవించాలి : 'పోకల'

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

విద్యార్థులు, పిల్లలకు కనిపించే దైవం తల్లిదండ్రులు గురువులేనని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ పోకల సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక అలంకార్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పదవ తరగతి చదువుతున్న ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి ఉన్నత విద్యకు పునాది అన్నారు. నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. నిత్యం మనముందు కనపడే తల్లిదండ్రులు, గురువుల వద్ద ఆశీర్వాదం పొందాలన్నారు. విద్యపై ధ్యాస ఉంచే సమయంలో చెడు సావాసం, సెల్ ఫోను, టివి, పక్క చూపులు పెట్టరాదన్నారు. ఏకాగ్రతగా అర్థం చేసుకుంటూ చదివితే మంచి ఫలితాలను సాధించి ఉన్నత స్థానాలు చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్ అంతా మీ చేతుల్లోనే ఉందన్నారు. అనంతరం బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, పద్మావతి హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రఓబుల్ రెడ్డి, రాఘవేంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ రామిరెడ్డి, గౌతమ్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీరెడ్డి, మైలవరం చైతన్య స్కూల్ చెన్నప్ప విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రేడియన్స్ దస్తగిరి, చల్లపల్లి (సరస్వతి విద్యా మందిరం) రమేష్‌రెడ్డి, విశ్వజ్యోతి పరిమళ, జాన్స్ హైస్కూల్ రవిశేఖర్, టికెఆర్ జీవన్‌జ్యోతి ప్రధానోపాధ్యాయులు గురుశేఖర్, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోకల సుబ్బారెడ్డి

# కనీస వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలకు కేటాయించిన ఇంటి స్థలాలకు 15ఏళ్లుగా అమృత్‌నగర్‌లో కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 21 రోజులుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. పేదల ఓట్లు అయితే నాయకులకు కావాలి.. వారి సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపలేకపోతున్నారన్నారు. దొంగ పట్టాలు సృష్టిస్తున్న వారిని అధికారులు కట్టడి చేయలేకపోగా వారితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆందోళనలో లత, రమీజా, వెంకటేశ్వర్లు, నరసింహ, హసీనా, సుబ్బరాయుడు, బాబు, మధు, హుస్సేన్ బాషా, పార్వతి, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు నరహరిపురం విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి - చాపాడు**

మండలంలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహశాస్త్రి తెలిపారు. ఈనెల 10,11వ తేదీల్లో బద్వేల్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో 8వ తరగతికి చెందిన చరణ్, గైడ్ టీచర్ సురేంద్రబాబు, మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఇ కేర్ ఫుడ్ స్టోరేజ్ ఫర్ గోడౌన్స్' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి, గైడ్ టీచర్లను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

## తహశీల్దార్, సిఐకి ఘనంగా సన్మానం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

స్థానిక పోలీస్‌స్టేషన్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామాంజులు, తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటలక్ష్మిని సోమవారం రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు ఆయా కార్యాలయాల్లో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నూర్‌బాషా సంఘం కార్యదర్శి ఆలమూరు దస్తగిరి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల పట్ల నిస్పక్ష పాతంగా విధులు నిర్వర్తించి, మెరుగైన సేవలు అందించాలని కోరారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

**ప్రజాశక్తి - మైదుకూరు**

మైదుకూరు మున్సిపల్ పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని వారుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా కృష్ణాపురం గ్రామ తాగునీటి బోరు నుండి శుద్ధ నీరు వస్తోందని, సమస్యను పరిష్కరించాలన్నారు. గతవారం రోజుల క్రితం మైదుకూరు పట్టణ పరిధిలోని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు రైతు సేవా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశామన్నారు. ఇందుకు అధికారులు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేదన్నారు. మైదుకూరు ఎర్రచెరువుకు తెలుగంగ ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసి చెరువుకు నీరు నింపడం వల్ల బోర్లలో నీటి శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మైదుకూరు పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మండల నాయకులు కత్తి నాగిరెడ్డి, షామీర్, నాగరాజు, శంకరయ్య, జయరాజు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవికి అభినందనలు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు రావడంతో ఆయనకు జమ్మలమడుగు చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు అల్లం సూర్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం అల్లం సూర్య నారాయణ మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్‌లో చిరంజీవిని కలిశామన్నారు. పద్మవిభూషన్ అవార్డ్ వచ్చినందుకు మెగా అభిమానులమైన తాము చాలా సంతోషంలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, చిరంజీవి అభిమాని విజయ్‌కుమార్ పాల్గొన్నారన్నారు.

## చియ్యపాడు ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా ఓబులేసు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామ ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా ఓబులేసు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో సర్పంచ్‌గా ఉన్న శివప్రసాద్ అనారోగ్య కారణాలతో 6 నెలలపాటు సెలవు పెట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు ఉప సర్పంచ్ ఓబులేసును సర్పంచ్‌గా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంపిడిఒ మహబూబ్ బీ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, ఎంపిటిసి బాల నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పశు సంవర్ధకశాఖ ఎడిగా మురళి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఖాజీపేట మండల పశు సంవర్ధక శాఖ ఎడిగా మురళి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి ఎడిగా ఏటూరు పశు వైద్యధికారి మునెయ్య బాధ్యతలు నిర్వర్తించేవారు. ఆయన ఉద్యోగోన్నతిపై ఎర్రగుంట్ల ఎడిగా వెళ్లారు. నూతన ఎడిగా బాధ్యతలు చేపట్టిన మురళి తిరుపతి జిల్లా పాపనాయుడుపేట నుంచి వచ్చారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పాడి పరిశ్రమ, పశు పోషకుల సమస్యల పరిస్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి

**ప్రజాశక్తి - మైదుకూరు**

స్థానిక వైసిపి కార్యాలయంలో మున్సిపాలిటీలోని గడ్డమాయపల్లి గ్రామానికి చెందిన తప్పెట నడిపి సుబ్బారెడ్డి వైద్యానికి అయిన ఖర్చును సోమవారం సిఎం సహాయ నిధి నుండి రూ.12 లక్షల చెక్కును లబ్ధిదారుడికి ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ ద్వారా ప్రజలకు అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని, పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రజలకు ఎన్నో విధాలా సేవలు అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని, ఎన్నికల్లో మళ్లీ వైసిపికే ఓటు వేయాలని ఆయన కోరారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న లబ్ధిదారుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ

**ప్రజాశక్తి - మైదుకూరు**

మండల పరిధిలోని వనిపెంట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతన్న విద్యార్థులకు మైదుకూరుకు చెందిన నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి వనిపెంట గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకుడు వల్లెం రంగారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నేస్తం సేవా సంస్థ సభ్యులు కోగటం కొండారెడ్డి, వన్నెంపల్లె ఉపేంద్రకుమార్, ముడమాల చెన్నకేశవరెడ్డి, అరిగెల వెంకటేష్, ఎవన్ కృష్ణ, నారాయణరెడ్డి, మీకోసం సేవా సంస్థ విష్ణు వర్ధన్, సుమన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బద్వేల్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయజ్యోతి?

**ప్రజాశక్తి-కాశినాయన**

ఈ ఏడాదిలో నిర్వహించబోయే అసెంబ్లీ ఎన్నికలలో బద్వేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్.డి. విజయజ్యోతి బరిలో ఉన్నారు. అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధంగా ఉన్నారని ఆమె వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ఉద్యోగిగా పనిచేసి రైతులకు, ప్రజలకు ఎనలేని సేవలు చేసి గొప్ప పేరు సంపాదించుకున్నారు. బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలలో ఆమెకున్న ప్రజాభిమానికి దృష్టిలో ఉంచుకుని 2014లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో పరాజయం పొందారు. అప్పట్లో గెలుపు తథ్యం అన్న సందర్భాలలో ఆ పార్టీలోని కొందరు నాయకులు స్వార్థ రాజకీయాలు చేయడంతో ఓటమి పాలయ్యారు. అయినా టిడిపి అధికారంలోకి రావడంతో ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతూ .. కార్యకర్తలకు అండగా ఉంటూ.. నిరంతరమూ ప్రజా సేవలోనే ఉన్నారు. 2019 ఎన్నికలలో టిడిపి టికెట్ ఆశించిన టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిలబడ్డారు. ప్రస్తుతం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వై.ఎస్. షర్మిలరెడ్డి రావడం..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టడంతో కాంగ్రెస్ పార్టీలో ఒక ఊపు అందుకుంది. అందులో భాగంగానే ఇటీవల షర్మిలా రెడ్డి కడప వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మరి కొంతమంది నాయకుల ఆధ్వర్యంలో విజయజ్యోతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె పార్టీలో చేరినప్పటి నుండి టిడిపి, వైసిపి వర్గీయుల్లో చర్చ మొదలైంది. విజయ జ్యోతి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్ణయిస్తే ముక్కోణం పోటీ గట్టిగా ఉంటుందని నియోజకవర్గంలో పలువురు చర్చించుకుంటున్నారు.

మహిళలకు మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

## అవకాశమిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**ప్రజాశక్తి - ఖాజీపేట**

రానున్న ఎన్నికల్లో ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని టిడిపి మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని నందిపాడు కాలనీలో సోమవారం ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా వెళ్లి ప్రచారం చేశారు. రానన్ను ఎన్నికల్లో తమను గెలిపిస్తే రాజోలి జలాశయం నిర్మించి మైదుకూరును సస్యశ్యామలం చేస్తానని అన్నారు. కాక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, ఖాజీపేట ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి, ఐ టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, భూమయపల్లె సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య, పిచ్చి నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి వీరయ్య, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, సిద్ధారం ఖదీరుల్లా, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, వెంకటయ్య యాదవ్ పాల్గొన్నారు.

## జగన్ అరాచకాలపై పూరించిన నాదమే శంఖారావం

**ప్రజాశక్తి - చాపాడు**

వైఎస్ జగన్, వైసిపి నాయకులు చేసే అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ శంఖారావానికి శ్రీకారం చుట్టిందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శి 40 రోజుల్లో 120 నియోజకవర్గాల్లో రాష్ట్రమంతా పర్యటించి, నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు శంఖా రావం అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే హామీలు వివరించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నారా లోకేష్ రాష్ట్రమంతా పర్యటించి కార్యకర్తలకు మరింత దగ్గరయ్యేలా చేస్తున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్

## నిరుద్యోగులకు ఉపాధి టిడిపితోనే సాధ్యం

**ప్రజాశక్తి - వేంపల్లె**

టిడిపి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి దొరుకుతుందని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, జబి బుల్లా తెలిపారు. స్థానికంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మెగా డిఎస్సీ కాకుండా దగా డిఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. నాలుగున్నర ఏళ్లలో 4709 ప్రభుత్వ పాఠశాలలు రద్దు, 25 వేల ఉపాధ్యాయ పోస్టులు గాలికి వదిలేసిన ఘనత జగన్‌కు దక్కిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల పూర్తి పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 117జిఒను కూడా రద్దు చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో భూపేష్‌రెడ్డి

## టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో సోమవారం 50 కుటుంబాలు భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరాయి. వీరికి ఆయన టిడిపి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్టీ అందరికీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. అందరం కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో కె.ఈశ్వరయ్య, ఎం.చెన్నయ్య, కె.బాలు, మల్లికార్జున, పి.ప్రసాద్, వల్లి, రామచంద్ర, లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి, సుదర్శన్, కుళ్లాయప్ప, వేణు, గిరి, నాగరాజు, జి.పీరయ్య, జి.బాబు, శివ, శంకర్, వి.నాగరాజు, చంద్ర, వాసు, మల్లి, ఎం.రమేష్, ఎం.సాల్మన్, బి.విజయ్, వెంకటశివ, రాజేష్, జయచంద్ర, దేవా ఉన్నారు. కార్యక్రమంలో మండలం ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

మార్చి 3న దేశవ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిపి సభా భవనంలో సోమవారం పల్స్ పోలియోపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. మిగిలిన చిన్నారులకు నాలుగు, ఐదు తేదీల్లో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ పరిధిలో పల్స్ పోలియో రూట్స్ సూపర్వైజర్స్, రూట్ సూపర్వైజర్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్, సిహెచ్‌ఒలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శాంతికళ